ఎస్సై మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

వర్ధన్నపేట, జూలై 7: ఎస్సై మృతికి కారకులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌పై సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు వివక్షత చూపుతూ వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. అవమానభారంతో దళిత కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. సీఐ, కానిస్టేబుళ్లను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వీరన్నను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడికి సన్మానం

నర్సంపేట రూరల్, జూలై 7: ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు భూక్యా వీరన్నను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఆదివారం ఇటుకాలపల్లిలో మాజీ ఎంపీటీసీ వీరన్నను మాజీ సర్పంచ్ మండల రవీందర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

గుంతలను పూడ్చుతున్న బీఆర్ఎస్ నాయకులు

గుంతలను పూడ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

గిర్మాజీపేట, జూలై 7: వరంగల్ 29వ డివిజన్ రామన్నపేట పోతననగర్ రోడ్ మార్గంలో ఏర్పడిన గుంతలను జీడబ్ల్యూఎంసీ అధికారులు, అధికార పార్టీ నేతలు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు గంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా వారిని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాళ్లపల్లి రమేశ్, బూస శేఖర్, రేండ్ల జంపయ్య, టీ సమ్మయ్య, నాగేశ్వరరావు, లోకేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ కోర్టులను వినియోగించుకోవాలి

హనుమకొండ సబర్బన్, జూలై 7 : విద్యుత్ సేవలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రిడ్రసల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) సేవలను వినియోగించుకోవాలని చైర్మన్ వేణుగోపాలచారి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో ఈ నెల 9 నుంచి 20వ తేదీ నిర్వహించే ఈ లోకల్ కోర్టుల్లో వినియోగదారులు తమ సమస్యలను ఫిర్యాదు చేస్తే తక్షణం పరిష్కారం పొందవచ్చని చెప్పారు. ఈ దఫాలో సత్తుపల్లి, అశ్వారావు పేట, కురవి, ములుగు, మంథని సబ్ డివిజన్లలో ఈ లోకల్ కోర్టులు ఉంటాయని తెలిపారు.

మొక్కను నాటుతున్న సహోదర్, సంఘం సభ్యులు

మొక్కలు నాటి సంరక్షించాలి

చెన్నారావుపేట, జూలై 7: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రెవరెండ్ సహోదర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను బాధ్యతగా రక్షించి వృక్షాలుగా చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్ గౌడ్, ఫ్యాస్టేట్ సెక్రటరీ గోపు శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్ బండారి భిక్షపతి, మిషన్ అండ్ ఇవాంజలిజం కన్వీనర్ హనోక్, శెంకేసి రంజిత్, సాంబయ్య, అనిల్, రమేశ్, శ్రీను, శోభన్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, KOMALLA YAKAIAH (Old Name), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist. -506002, T.S., have changed as KOMANDLA YAKUB REDDY (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME
I, KOMALLA DEVENDER (OLD NAME), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist. -506002, T.S., have changed as KOMANDLA DEVENDER REDDY (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME
I, KOMALLA UPENDRA (Old Name), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist.-506002, T.S., have changed as KOMANDLA UPENDRA (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME
I, KOMALLA SARITHA (Old Name), H.No. :11-12-613, Road No. 13 B, 'O" City, Warangal Dist.-506002, T.S., have changed as KOMANDLA SARITHA (New Name) for all purposes.
NTW-17145

CHANGE OF NAME
I, MOHAMMED MAHEBOOB, S/o. SAYAB ALI, R/o. H.No. 11-23-1794, Ekashila Nagar, LB Nagar, Warangal, T.S.,-506002, India. have changed my name to MOHAMMED MAHABOOB and solemnly declare.
NTW-00

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

తాగునీటి కోసం తండ్లాట

- గుక్కెడు నీళ్ల కోసం అరిగోస
- మిషన్ భగీరథ నీళ్లకు మంగళం
- ఎస్సీ కాలనీల వైపు కన్నెత్తి చూడని అధికారులు

ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బోరు నీళ్లు పట్టుకుంటున్న ఎస్సీ కాలనీ వాసులు

కాలిపోయిన బోరు మోటర్

రాయపర్తి, జూలై 7 : గుక్కెడు నీళ్ల కోసం రెండు నెలలుగా ఎస్సీ కాలనీవాసులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. మంచినీళ్లియ్యండి మహాప్రభో.. అంటూ ఆర్థనాదాలు పెడుతున్నారు. అయినా తమను పట్టించుకున్న నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎస్సీ కాలనీలకు వచ్చి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. ఇక గ్రామ పంచాయతీ అధికారులు ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్నారనే తప్ప నీళ్లడిగితే మొహం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గట్టికల్ గ్రామ పంచాయతీలోని 3, 4 వార్డుల పరిధిలో సుమారు 50 కుటుంబాలతో ఉన్న ఎస్సీ కాలనీవాసులు తాగునీరు దొరక్క రెండు నెలలుగా అరిగోస పడుతున్నారు. గత ఏప్రిల్ నెలలో ఈదురుగాలులు, అధిక లోడ్ కారణంగా కాలనీకి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. కాలనీకి తాగునీరు అందించే బోరు మోటర్ సైతం కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించిన అధికారులు బోరు మోటర్‌ను తీసి బయట పడేశారు. మోటర్‌కు రిపేర్ చేయిస్తే కాలనీకి తాగునీరు అందుతుందంటూ పలుమార్లు గ్రామ పంచాయతీకి వెళ్లి మొరపెట్టుకున్నా ఆలకించే నాథుడే లేడడి వాపోతున్నారు. తాగునీటి కోసం సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ బోర్లు, బావులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ కాలనీకి మిషన్ భగీరథ జలాలు అందించిందని, ఇప్పుడు కనీసం ఆ నీళ్లను కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. కాగా, డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో బోరు నీళ్లు పట్టుకునేందుకు వెళ్తే.. నర్సరీలోని మొక్కలకు నీళ్లు కావాలంటూ గ్రామ పంచాయతీ సిబ్బంది ఆగ్రహంతో స్టాటర్ డబ్బాకు తాళాలు వేసుకొని వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని 400 జనాభా గుక్కెడు నీళ్ల కోసం తల్లడిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కార్యదర్శి సుమలతను వివరణ కోరగా.. నిధుల లేమీతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని, మోటర్లు, స్టార్టర్లకు రిపేరులు చేయించే పరిస్థితి లేదన్నారు. ఇలాగే ఉంటే ఖాళీ బిందెలతో కలెక్టరేట్‌కు వెళ్లి ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

పట్టించుకోవడం లేదు..

ఎస్సీ కాలనీకి తాగునీళ్లు లేక రెండు నెలలైంది. గ్రామ పంచాయతీ పైపులైన్‌లో సరఫరా చేస్తున్న నీరు తాగడానికి పనిక రావు. కాలనీలో ఉన్న బోరు నీళ్లే మా అందరికీ ఆధారం. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాళ్ల పనితీరును ప్రశ్నించే నాథుడే లేకపోవడంతో వాళ్లు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు తయారైంది వ్యవస్థ.

– మాదారపు నాగలక్ష్మి, మాజీ వార్డు సభ్యురాలు

ముసలోళ్ల బాధలు చెప్పేటట్లు లేవు..

రెన్నెళ్ల కాన్నుంచీ మంచినీళ్లు ఒత్తలేవు నాయనా. చానా ఇబ్బంది అయితాంది. ఉన్నదో.. లేందో ఇంత ఉడుకబెట్టుకుని తిని కడుపునిండా నీళ్లు తాగుదామనుకుంటే ఉప్పు నీళ్లే ఒత్తానయ్. కాలనీల ఉన్న బోరు నడిపిత్తలేరు. ముమ్మల చూసిన నాయకుడే లేదు. ముసలోల్లు, ముడిగోల్లు బాయిల కాడికి, బోర్ల కాడికి బిందెలు పట్టుకుని పోయి తెచ్చుకునే పరిస్థితి లేదాయే. కండ్లు మూసుకుని కాలం గడుపుతానం.

– సన్నూరి యాకమ్మ, కాలనీవాసి

తిరిగితిరిగీ చెప్పలు అరుగుతానై..

ఎస్సీ కాలనీలోని బోరు మోటర్‌ను బయటకు తీసి రోడ్డుపై పడేశారు. కనీసం బోరు పాయింట్‌పై మూత కూడా పెట్టలేదు. ఎవరన్న ఒక్కరాయి ఆ బోరు పాయింట్‌లో వేసినా అధి పని చేయకుండా పోతది. పిల్లలు ఆడుకుంటూ వచ్చి పడిపోతే ప్రాణాలకే పెద్ద ప్రమాదం. ఎన్ని సార్లు మొత్తుకున్నా మమ్ముల పట్టించుకుంట లేరు. బోరు మోటరును బాగు చేయించండి అంటూ గ్రామ పంచాయతీ సుట్టూ తిరిగితిరిగీ మా చెప్పులు అరుగుతానై. కార్యదర్శి మేడం కరుణ చూపడం లేదు.

– దాసరి రేణుక, గృహిణి

సమాజాభివృద్ధికి కృషి చేయాలి

నర్సంపేట రూరల్, జూలై 7: మూలాలు మరవకుండా ప్రతి ఒక్కరూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని కవి, గ్రంథాలయ ఉద్యమకర్త కాసుల రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో లీడ్ లైబ్రరీ ఆధ్వర్యంలో జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ సమక్షంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కరరావు, జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు రంజిత్, అనిల్, శివ, సందీప్, విష్ణు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో దొంగల హల్‌చల్

- భయాందోళనలో ప్రజలు
- పోలీసుల నిర్లక్ష్యంతో సమస్య తీవ్రం

నయీంనగర్, జూలై 7 : నగరంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పట్టపగలు గస్తీ నిర్వహించి అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అందినకాడికి దోచుకుంటున్నారు. ఇటీవల కాజీపేట దర్గాలో అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో చొరబడి మూడు గ్యాస్ పొయ్యిలు, సిలిండర్లను ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. హనుమకొండ చౌరస్తాలోని ఓ పూల షాప్‌లో పని చేసే వ్యక్తి స్కూటీని ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. ఫిబ్రవరి 27న బైక్ పోతే మార్చి 14 వరకు పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పించుకుని 17న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఫిర్యాదు చేసినప్పుడే ఎంక్వైరీ చేస్తే తన బైక్ దొరికేదని చెప్పాడు. పోలీసు స్టేషన్‌లో ఉండే బీట్ ఆఫీసర్లు సరిగ్గా గస్తీ నిర్వహిస్తే ఈ సమస్య తలెత్తదని, అర్ధరాత్రి ఇళ్ల సమీపంలో తిరిగే అనుమానిత వ్యక్తులను విచారిస్తే ఈ సమస్యలు తలెత్తవని బాధితులు చెబుతున్నారు.

హసన్‌పర్తిలో బేరసారాలు

నెల రోజుల క్రితం భార్యాభర్తలు తమ బైక్‌పై వెళ్తుంటే ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని ముచ్చర్ల నాగారం క్రాస్‌రోడ్డు వద్ద కొందరు యువకులు వారిని కొట్టి బంగారం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇటీవల హసన్‌పర్తికి చెందిన ఓ విద్యార్థి పరకాల నుంచి వస్తున్న క్రమంలో అతడిని చితకబాది బంగారం, సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్లు సమాచారం. మరుసటి రోజు పెద్ద మనుషులు స్టేషన్‌కు చేరుకుని కేసులు కాకుండా చేసినట్లు తెలిసింది. నిత్యం దొంగతనాలు చేస్తున్న యువకులకు పోలీసులు అంటే భయం లేకుండా పోయిందని, హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో వారిపై దరఖాస్తు ఇచ్చినప్పుడు కఠినమైన చర్యలు తీసుకుంటే ఈ సమస్యలు రావని పలువురు ఆరోపిస్తున్నారు.

19 నుంచి అరుణాచలగిరికి ప్రత్యేక బస్సు

హనుమకొండ చౌరస్తా, జూలై 7 : తమిళనాడులోని అరుణాచలగిరికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును వరంగల్-1 డిపో ఏర్పాటు చేసిందని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. జూలై 19న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుందని 20న ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్ కాణిపాకం చేరుకుంటుందని, ఒంటి గంటకు వెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం, రాత్రి 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. అరుణాచలేశ్వరస్వామి వారి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 21న అక్కడి నుంచి బయలుదేరి 22న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి చేరుకుంటుందని, అక్కడ దర్శనానంతరం హనుమకొండకు చేరుకుంటుందన్నారు. టూర్ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.2,500 సంస్థ నిర్ణయించిందన్నారు. సంస్థ అధికారిక వెబ్‌సైట్ tsrtconline.in లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోనూ బుక్ చేసుకోవచ్చన్నారు. పూర్తి సమాచారం కోసం 98663 73825, 7382855492 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్

కరీమాబాద్, జూలై 7: వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రంగశాయిపేటలోని వాటర్ ట్యాంకులో పబ్లిక్ టాయిలెట్స్‌ను మహిళల కోసం నిర్మించారు. కొన్నాళ్లకు వాటి తలుపు విరిగిపోయింది. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పత్తా లేరని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంగ్యా సేవలు చిరస్మరణీయం

రాయపర్తి, జూలై 7: జయరాంతండా(ఎస్) గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యాతండాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, స్వర్గీయ భూక్యా సంగ్యానాయక్ సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ తెలిపారు. సంగ్యానాయక్ కుమారులైన భిక్షంనాయక్, విజయ్‌నాయక్ సారథ్యంలో ఏర్పాటు చేసిన సంగ్యానాయక్ విగ్రహాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సన్నూరు మాజీ సర్పంచ్ భీష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, నాయకులు నూనె అనిల్‌కుమార్, రాపాక ప్రశాంత్‌కుమార్, గణేశ్, అశోక్, సుమన్, సందీప్, రాకేశ్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో గొర్రెల మృతి

ఖానాపురం, జూలై 7: విద్యుదాఘాతంతో 9 గొర్రెలు మృతి చెందిన ఘటన బుధరావుపేటలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సదయ్య తన గొర్రెలను శనివారం సమీప పొలాల్లో మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా వర్షం పడడంతో ఇంటి ఎదుట ఉన్న రేకుల షెడ్‌లోకి గొర్రెలను పంపిం చాడు. షెడ్‌కు విద్యుత్ సరఫరా కావడంతో రాత్రివేళ 9 గొర్రెలు మృతి చెందాయి. రూ. 1.50 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఖానాపురం, జూలై 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1978-79 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 45 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా హాజరై పరిచయ కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకొని బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. గురువులు శంకరయ్య, శేషయ్య, అనంతరెడ్డి, సుబ్బారావు తోపాటు పది మందిని సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేముల వెంకటేశ్వర్‌రావు, ఎడ్ల దేశాయిరెడ్డి, పతకమూడి శ్రీనివాసరావు, యాదగిరి, యార్లగడ్డ వెంకటేశ్వర్‌రావు, సోమేశ్వర్, వెంకటరత్నంతో పాటు మరో 30 మంది పాల్గొన్నారు.



పర్వతగిరి: ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దంపతులు

రాయపర్తి : ప్రజాప్రతినిధులతో ఎర్రబెల్లి

ప్రజా శ్రేయస్సే ప్రధానం

- మా జీవితం ప్రజా సేవకే అంకితం
- ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, జూలై 7: ప్రజా శ్రేయస్సే తమ ప్రధాన కర్తవ్యమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని తన స్వగృహంలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల వీడ్కోలు ఆత్మీయ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు, ఉషా దంపతులు మాట్లాడుతూ తనవంతుగా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిరంతరం ముందుకు సాగుతున్నామని, తమ జీవితం ప్రజా సేవకే అంకితమని, రాజకీయాల్లో ప్రవేశించింది ప్రజలకు సేవ చేయడానికేనన్నారు. రానున్న కాలంలో పార్టీ శ్రేణులకు మంచి భవిష్యత్ ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్య పడొద్దని బీఆర్ఎస్ నేతలకు అభయమిచ్చారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలాగా కాపాడుకుంటామన్నారు. అనంతరం దయాకర్‌రావు దంపతులు పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక సంస్థల తాజా మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గాంధీనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, అనిమిరెడ్డి, సురేందర్‌రావు, గోపాల్‌రావు, మాజీ ఎంపీపీలు అప్పారావు, కమలపంతులు, పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితెందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రాయపర్తి: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పదవీ విరమణ పొందినప్పటికీ మండలంలోని సబ్బండ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి నాయకులుగా నిరంతరం కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇటీవల మండలంలో పదవీ విరమణ పొందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీని తన నివాసంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నేతలంతా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అలుపెరుగని పోరాటం చేయాలని కోరారు.

సిబ్బందిని సన్మానిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ పోలీసులకు సన్మానం

కాశీబుగ్గ, జూలై 7: ఇటీవల హంటర్‌రోడ్డులో గుర్తుతెలియని మహిళను చేరదీసి అపన్నహస్తం అందించి ఎంజీఎంలో చేర్పించిన పోలీస్ సిబ్బందిని ఆదివారం సన్మానించారు. డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ భారతి చారిట్రబుల్ ట్రస్ట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మట్టెవాడ స్టేషన్ పరిధిలోని బ్లూకాట్స్ సిబ్బంది టి.కల్యాణ్‌కుమార్, రవి, ఎస్ఎఫ్‌వో దయాకర్, కార్పొరేషన్ పరిధిలోని డీఆర్ఎఫ్ సిబ్బంది కె.శ్రీనివాస్, సీహెచ్.మహేందర్, ఎన్.రాజు, ఖలీద్ సేవలను గుర్తించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి వారిని అభినందించారు.

గుంతలో నిలిచిన వర్షపు నీరు

చెరువులను తలపిస్తున్న రోడ్లు

ఖానాపురం, జూలై 7: మండలకేంద్రంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. తేలికపాటి వర్షాలకే చెరువులను తలపిస్తున్నాయి. మండలకేంద్రంలోని రెండో బస్టాండ్ సెంటర్ నుంచి పెద్దమ్మగడ్డ, మనుబోతులగడ్డ, ఆయకట్టు రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయినా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరుగకముందే గుంతను పూడ్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దొంతి

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నర్సంపేట రూరల్, జూలై 7: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. పర్శనాయక్‌తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ అజ్మీరా శంకర్‌నాయక్ తల్లి మల్లికమ్మ ఇటీవల మృతి చెందింది. కమ్మపల్లికి చెందిన సంకటి కృష్ణారెడ్డి భార్య కల్పన అనారోగ్యంతో పది రోజుల క్రితం మరణించింది. ఆయా కుటుంబాలను దొంతి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వైభవంగా బీరన్న బోనాలు

నృత్యం చేస్తున్న కళాకారులు

కాశీబుగ్గ, జూలై 7: వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని బీరన్నస్వామి ఆలయంలో ఆషాఢమాసం తొలిబోనాన్ని ఆదివారం కురుమ కులస్తులు బీరన్నకు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో బయల్దేరారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అనంతరం బీరన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు.

పెంపుడు కుక్కకు దశ దినకర్మ

కాజీపేట, జూలై 7 : కాజీపేట పట్టణం 48వ డివిజన్ పరిధిలోని దర్గా భీమ్ నగర్ కాలనీలో పెంపుడు కుక్కకు ఆదివారం దశ దినకర్మ చేశారు. దర్గా కాజీపేటకు చెందిన గుండాల వెంకటేశ్వర్లు (పశు సంవర్ధక శాఖ ఏడీ, ఏటూరు నాగారం) 14 ఏండ్లుగా ఓ కుక్కను పెంచుకుంటున్నాడు. ఈ నెల 28న కుక్క అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కుక్కకు అంత్యక్రియలు నిర్వహించి, పదో రోజున దశ దినకర్మ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సింగారపు రవిప్రసాద్, రాజేశ్‌ఖన్నా, రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల శేషాచారికి పురస్కారం

అవార్డు అందుకుంటున్న శేషాచారి

కాశీబుగ